క్లుప్తంగా

మనూ అడ్మిషన్ల గడువు పొడిగింపు

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ప్రవేశ ఆధారిత కోర్సులలో అడ్మిషన్ల గడువు పొడిగించినట్లు ఉర్దూ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం వనజ శుక్రవారం తెలిపారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ, పీజీ, బీఈడీ, బీటెక్, డిప్లొమో, రెగ్యులర్ మోడ్ ప్రోగ్రామ్‌లకు ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లను పంపాలని తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు జూన్ 6వ తేదీ వరకు పొడిగించామన్నారు. ప్రవేశ పరీక్షలను జూన్ 20, 21,22 తేదీలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలో కొత్తగా 8 కోర్సులను ప్రవేశ పెట్టడం జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం యూనివర్శిటీ వెబ్‌సైట్ సందర్శించాలని ఆమె సూచించారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్ : మియాపూర్ డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.1.77 కోట్లతో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు , ఎఫ్‌సీఐ కాలనీలో రూ.35 లక్షలతో సీసీ రోడ్డు, జనప్రియ వెస్ట్ సిటీలో రూ.26 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, లక్ష్మి వెంకటనగర్ కాలనీలో రూ.29.25 లక్షలతో యూజీడీ, గ్రీన్ వ్యాలీ కాలనీలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, బీకె ఎన్‌క్లేవ్‌లో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, డాక్టర్ రెడ్డీస్ ఎన్‌క్లేవ్‌లో రూ.27 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సామాజిక సేవ



ప్రైమరీ స్కూల్‌కు రంగులు వేస్తున్న ఆర్ఎస్ఎం ఉద్యోగులు

శేరిలింగంపల్లి: నిత్యం కంప్యూటర్‌లతో కుస్తీ పట్టే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు స్కూల్‌కు రంగులు వేశారు. గచ్చిబౌలిలోని ఆర్ఎస్ఎం కంపెనీ ఉద్యోగులు శుక్రవారం స్కూల్‌ను శుభ్రం చేయడంతో పాటు చిన్నపాటి మరమ్మతులు చేశారు. విద్యార్థులకు చార్టులను తయారు చేయడం నేర్పించారు. పెన్సిల్స్ తదితరాల కిట్స్‌ను అందజేశారు. ఆర్ఎస్ఎం ట్యాక్స్ డైరెక్టర్ రమేష్ కున్నత్ మాట్లాడుతూ తాము ప్రతి ఏటా ఒక రోజు సేవా కార్యక్రమం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎం ఉద్యోగులు ఇలియాస్, ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు



ఇంటింటి ప్రచారంలో రవికుమార్‌యాదవ్

రాయదుర్గం: శేరిలింగంపల్లి ప్రజలు మార్పును కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి కొండాపూర్ డివిజన్‌లోని వీకర్‌సెక్షన్ కాలనీ, శ్రీనివాసకాలనీ, ప్రశాంత్‌నగర్‌లో 39వ రోజు గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్నినిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రజా సమస్యలు పట్టించుకోలేదని, రోడ్డు, డ్రైనేజీ, పైప్‌లైన్లు, స్ట్రీట్‌లైట్లు తప్ప ఈ ప్రభుత్వంలో కొత్తగా చేసిందేవీ లేదన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, బీజేపీ నాయకులు నర్సింహ్మాయాదవ్, నీలంకృష్ణ, ఆంజనేయులు,రాధకృష్ణయాదవ్, అనీల్‌కుమార్‌యాదవ్, చంద్రశేఖర్‌యాదవ్, వెంకటేష్, మల్లేష్, భరత్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు

శేరిలింగంపల్లి: చందానగర్ డివిజన్ సిటిజన్ కాలనీలో మూన్నాళ్ళకోసారి డ్రైనేజీ రోడ్డుపై పారుతోంది. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జికి ఆ రోడ్డు మీదుగా వెళ్ళే వాహనాలు, వచ్చే వాహనాలతో రద్దీగా ఉండటంతో పాటు పలు హోటళ్ళు, షాపులు ఉండటంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. అదే విధంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించే క్రమంలో మురుగు వారిపై పడుతుండంతో ఆఫీసలకు వెళ్ళలేక తిరిగి ఇంటికే వెళ్ళాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇక వర్షాకాలం వస్తే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నారు.



సిటిజన్ కాలనీ రోడ్డులో మురుగు

గచ్చిభళా

- అభివృద్ధిలో పరుగులు తీస్తున్న డివిజన్
- 5 నెలల్లో రూ.30.12 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- చెరువుల సుందరీకరణ, సీసీరోడ్లు, వరదనీటి కాలువల నిర్మాణం







డివిజన్‌లో ఇటీవల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: నగరంలోనే అత్యధిక పన్నులను చెల్లించే డివిజన్లలో ప్రత్యేకతను చాటే గచ్చిబౌలి డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది ఐదు నెలల్లో రూ.30.12 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిల ప్రత్యేక చొరవతో పలు శంకుస్థాపనలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, చెరువుల సుందరీకరణ, సీసీరోడ్లు, వరదనీటి కాలువలు, మంచినీటి పైప్‌లైన్ పనులు, డ్రైనేజీ పనులు చేస్తారు.

గచ్చిబౌలి డివిజన్‌లో చేసిన శంకుస్థాపనలు

- జనవరి 28వ తేదీ ..రూ.2.73 కోట్ల అభివృద్ధి పనులు
- మార్చి 21వ తేదీ ...రూ.7.03 కోట్లతో రూ.0.80 లక్షలతో
- మార్చి 28వ తేదీ .. రూ.0.25 లక్షలతో
- ఏప్రిల్ 12వ తేదీ ... రూ.12.15 కోట్లతో
- మే 6వ తేదీ... రూ.1.50 కోట్లతో
- మే19వ తేదీ.. రూ.2.56 కోట్లతో

పూర్తి కావొస్తున్న పనులు ఇవే..

- రాయదుర్గంలో రూ.3 కోట్లతో చేపట్టిన ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావొచ్చింది.
- రూ.11 లక్షలతో ఖాజాగూడ మోడల్ రోడ్డులో సైకిల్‌ట్రాక్, ఫుట్‌పాత్‌ల నిర్మాణం
- మల్కంచెరువు, ఖాజాగూడ చెరువు సుందరీకరణకు నోచుకోవడం, మరో నాలుగు చెరువుల సుందరీకరణకు శంకుస్థాపనలు జరగడం
- ముఖ్యంగా తాగునీటి సమస్య కొంతతీరినా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో మెరుగుకాలేదు.
- రూ.4 కోట్లతో ఖాజాగూడలో ఇండోర్ స్టేడియం, టీఎన్‌జీఓ కాలనీలో రూ.50లక్షలతో మోడల్ మార్కెట్ పూర్తి చేసినా అందుబాటులోకి తేలేదు. చెరువుల సుందరీకరణ పూర్తిస్థాయిలో కాలేదు.
- గోపన్‌పల్లిలో రెండు రోడ్ల విస్తరణ పనులు, తండాలో ఫ్లైఓవర్ నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు
- టీఎన్‌జీఓ కాలనీలో ప్రహరీలకే పరిమితమైన పార్కులను అభివృద్ధి చేయాల్సి ఉంది.
- గోపన్‌పల్లితండాలో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్, మినీ మహాప్రస్థానం పూర్తి కాలేదు.
- రాయదుర్గం వార్డు కార్యాలయం వరకు షటిల్ బస్సు, కోఠి, మెహిదీపట్నంకు నానక్‌రాంగూడ మీదుగా బస్సుల రాకపోకలు మరింత పెంచాలనే డిమాండ్ వస్తోంది.
- మెట్రో రైలు సౌకర్యం కూడా రెండేళ్లలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్లను కలిసిన ఎమ్మెల్యే

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు. శుక్రవారం మింట్ కాంపౌండ్‌లోని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా తగిన చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని ప్రకటించినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు, మా కార్యాలయానికి గానీ, కార్పొరేటర్ల కార్యాలయాలకు గానీ విద్యుత్ సమస్యలు తీసుకొస్తే సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ప్రత్యామ్నాయ స్థలాల్లో ఏర్పాటు చేయాలని, అలాగేశిథిలావస్థకు చేరిన వాటిని కూడా తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. సర్వే నంబర్ 77,78,79,80 ప్రాంతాలలో, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్, గోకుల్‌ఫ్లాట్స్, హఫీజ్‌పేట్ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఎస్ఈ వెంకన్న ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాయదుర్గంకు చెందిన అనురాధకు రూ.2.50 లక్షలు, హఫీజ్‌పేట్ డివిజన్‌లోని యూత్ కాలనీకి చెందిన మమేనాఖతోన్‌కు. రూ.2.50 లక్షల సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాలను అందించారు.

ఆల్విన్‌కాలనీలో...

ఆల్విన్‌కాలనీ: అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్‌యస్ పార్టీ గౌరవ అధ్యక్షుడు హరీష్‌రావు, లక్ష్మారెడ్డి, సాంబశివరావు, ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రావు, దామోదర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంక్యుబేషన్ ఎకోసిస్టమ్ అవసరం



స్టార్టప్ ప్రతినిధులు, అధికారులతో డీబీటీ మాజీ సెక్రటరీ డా.రేణుస్వరూప్

రాయదుర్గం: భారతదేశం నాలెడ్జ్ ఎకానమీకి మద్దతు ఇచ్చేందుకు ఇంక్యుబేషన్ ఎకోసిస్టమ్ అవసరమని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ కేంద్ర మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి డాక్టర్ రేణుస్వరూప్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోని ఎస్పైర్-బయోనెస్ట్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. ఇంకుబేషన్ లోని స్టార్టప్ సీఈఓలతో సంభాషించారు. స్టార్టప్‌ల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇంక్యుబేటింగ్ స్టార్టప్‌ల శాస్త్రవేత్తలు, సిబ్బంది ఆమెకు వినూత్న ఉత్పత్తుల గురించి వివరించారు. ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేషన్ సెంటర్ ఇతర సెంటర్లకు నమూనాగా మారుతుందన్నారు.

గీతం సమ్మర్ స్టార్టప్ స్కూల్

పటాన్‌చెరు టౌన్: రుద్రారంలోని వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ (వీడీసీ) గీతం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 31వ తేదీ వరకు 'సమ్మర్ స్టార్టప్ స్కూల్' పేరిట ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గీతంలోని ఈ-క్లబ్, ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు వీడీసీ సీనియర్ వెంచర్ కోచ్, కార్యక్రమ నిర్వాహకుడు వాసుదేవ్ శుక్రవారం పేర్కొన్నారు. సమాచారం కోసం 97038 31819, 78932 78734 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

చదువుకు సాయం

- వన్ ఛాలెంజ్ ద్వారా రూ.50 వేలు అందజేసిన సీఐ వేణుగోపాల్‌రెడ్డి



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు...కాయకష్టం చేసి పెంచి పెద్దచేసిన తల్లి కూడా ఏడాది క్రితమే మరణించింది. ఉండడానికి సరైన నీడ లేకపోయినా..ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా చదువును మాత్రం మధ్యలో ఆపలేదు నల్లగొండ జిల్లా అనుముల మండల పరిధిలోని పాలెం గ్రామానికి చెందిన అక్కాచెల్లి తాడికొండ కావేరి, తాడికొండ పింకి. కాగా హాలియాలోని త్రివేణి కాలేజీ నుంచి కావేరి ఒకేషనల్ విభాగంలో ఇంటర్, చింతగూడెం జిల్లాపరిషత్ పాఠశాలలో పింకి 7వతరగతి పూర్తి చేశారు. ఒకవైపు చదువుకుంటూనే, సెలవుల్లో కూలిపనులకు వెళుతూ వచ్చే ఆదాయం ద్వారా నెట్టుకొస్తున్నారు. కావేరికి పెద్ద చదువులు చదవాలని ఉన్నా, ఆర్థిక పరిస్థితులు అనుకూలించక దిక్కుతోచని స్థితిలో ఉంది. కొందమంది మిత్రులు వన్‌ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, పటాన్‌చెరు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి దృష్టికి కావేరి, పింకి విషయం తీసుకెళ్లారు. చెరో రే.25 వేల చొప్పున యాభైవేల రూపాయలు చెక్కు రూపంలో శుక్రవారం సీఐ వేణుగోపాల్‌రెడ్డి పటాన్‌చెరులో అందజేశారు. ఈ సందర్భంగా కావేరి మాట్లాడుతూ సీఐ అందించిన సాయంతో ఉన్నత చదువులు చదువుతానని చెప్పారు. కార్యక్రమంలో వన్ ఛాలెంజ్ అడ్వయిజర్ సాయి కృష్ణ, సభ్యుడు జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను విస్తృతం చేయాలి


హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో వీసీ బీజేరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.కృష్ణయ్య

రాయదుర్గం: రాబోయే రోజుల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలను మరింత విస్తృతపర్చాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సూచించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ పరిపాలనా భవనంలోని తన చాంబర్‌లో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) వాలంటీర్లు అరుణ అనిల్‌కుమార్, సమీరాబిందు, జల్లిఆకాష్, సిద్ధాంత్‌శుక్లాలను అభినందించి వారిని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో క్యాంపస్‌లోనే కాకుండా వెలుపల కూడా అనేక ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించాలని ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య, ఇతర అధికారులను ఆదేశించారు. ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలకు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెషన్స్ చిత్ర ప్రదర్శన





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఎక్స్‌ప్రెషన్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ఎన్ఐఈపీఐడి డైరెక్టర్ మేజర్ రామ్‌కుమార్ శుక్రవారం ప్రారంభించారు. కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కొనియాడారు. చిన్నారులు, కేరళ మహిళలు 40 మంది వేసిన చిత్రాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ ప్రదర్శన ఈనెల 28వ తేదీ వరకు ఉంటుందని, ఉదయం 10 గంటల నుండి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. 450కి పైగా చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాకారిణి కరిష్మ, నైసిస్‌మెరైన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి రాజన్‌సూద్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్కీ'లో ముగిసిన సెమినార్



ముగింపు సమావేశంలో పాల్గొన్న అతిథులు, సభ్యులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి సదస్సు శుక్రవారం ముగిసింది. ముఖ్యంగా మైనింగ్, ఖనిజ పరిశ్రమలలో భద్రత, ఆరోగ్యం, పర్యావరణాన్ని మెరుగుపర్చడానికి మైనింగ్ పరిశ్రమలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వక్తలు పలు సూచనలు చేశారు. కొత్త సాంకేతికత, మారిన భౌగోళిక, పని పరిస్థితులు, కార్యకలాపాలు, భద్రత ,నిర్వహణ ప్రణాళిక, అమలు, పర్యవేక్షణ, ఆడిటింగ్ తయారీపై వక్తలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మైనింగ్ విధానంలో ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఓఐటీడీఎస్ వంటి అధునాతన సాంకేతికత వినియోగం, జీఐఎస్ ఆధారిత ఆర్ఎస్, రాడార్, డ్రోన్స్, ఆర్ఎఫ్ఐడీల వినియోగంపై చర్చించారు. ముగింపు సమావేశంలో కర్నాటక ఎన్ఐటీకే ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, హైదరాబాద్ ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి సాహూ, సింగరేణి మైనింగ్ సలహాదారు డీఎన్‌ప్రసాద్, అన్నా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె శ్రీనివాస్, సలహాదారు డాక్టర్ ఎం ఎస్ వెంకట్‌రామయ్య, మైనింగ్ హెడ్ కెజే అమర్‌నాథ్, ఎస్కీ అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మున్సిపాలిటీల పరిధిలోని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధి 14వ వార్డు గ్రీన్ మెడోస్ కాలనీలో జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో రూ.1.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి ఏటా కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.25 కోట్లతో ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువలు నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగ రెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహగౌడ్, కౌన్సిలర్ కవిత శ్రీనివాస్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

29న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరుటౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతీనెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆఫ్ కే నిఖత్ 2.0 ఈనెల 29వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ శుక్రవారం తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో రామచంద్రాపురం పరిధి భెల్ విద్యుత్‌నగర్, మార్గదర్శిని స్కూల్లో, సంగారెడ్డి జిల్లాలో.. జహీరాబాద్‌లోని అరుణ హైస్కూల్‌లో, మెదక్ జిల్లాలో నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఈపీఎఫ్ చందాదారులకు ప్రాంతీయ కమిషనర్ చేతుల మీదుగా పెన్షన్ మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. భవిష్యనిధి సమస్యలున్నవారు పై మూడు కేంద్రాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు శ్రీవారి కల్యాణం

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహరక్షేత్రంలో నేడు శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణం, అన్నసమారాధన, సాయంత్రం స్వామివారి ఊరేగింపు ఉంటుందని, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బస్తీ దర్శన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డినగర్ కాలనీలో శుక్రవారం బస్తీ దర్శన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నెంబర్-2లో డ్రైనేజీ సమస్య ఉందని చెప్పారు. కాలనీవాసులు తనదృష్టికి తీసుకొచ్చిన సమస్యను త్వరలో పరిష్కారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ గుప్తా, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేష్‌లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శేరిలింగంపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు లింగంపల్లి రైల్వేస్టేషన్ పార్కింగ్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం (60) కనుగొన్నారు. అయితే వివరాలు ఇంకా తెలియలేదు, అతను బిచ్చగాడు అయి ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిస్తే వెంటనే చందానగర్ పోలీసులకు ఫోన్ 8008029073కి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

ప్రగతి పథంలో పటాన్‌చెరు పల్లెలు

రూ.2.70 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలోని గ్రామాలను ప్రభుత్వ, సీఎస్సార్ నిధులతో ప్రగతికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం గ్రామంలో జీవీఆర్ ఎంటర్ ప్రైజెస్ సౌజన్యంతో రూ.2.50 కోట్లతో పాశమైలారం నుంచి నందిగామ మీదుగా క్యాసారం వరకు నిర్మించిన రోడ్డు, రిట్జ్ ఇండియా పరిశ్రమ సౌజన్యంతో రూ.5.25 లక్షలతో ఏర్పాటుచేసిన వీధి దీపాలు, రూ.18 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డును స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రతీగ్రామంలో మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్ల నిధులు వెచ్చిస్తున్నామన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు జాతీయస్థాయిలో గుర్తింపు పొందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, జెడ్పీటీసీ సుప్రజ, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ మోటే కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు పాండు, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

విద్యుదాఘాతంతో..

పటాన్‌చెరు టౌన్: విద్యుదాఘాతంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. భానూర్- బీడీఎల్ ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లాకు చెందిన లక్ష్మప్ప(38) పటాన్‌చెరు మండల పరిధిలోని నందిగామ గ్రామ పరిధిలో ఉన్న కాలేజీకి సంబంధించిన ఎంట్రెన్స్ జెండాలు కడుతున్న క్రమంలో విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

రోడ్డు ప్రమాదంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరనగర్‌కాలనీలో నివాసముండే నవీన్‌కుమార్(30) ర్యాపిడో బైక్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11.30గంటలకు బైక్‌పై బయలుదేరి వెళ్లాడు. శుక్రవారం తెల్లావారుజామున 4.40గంటల సమయంలో అశోక్‌నగర్ నర్సరీ సమీపంలో యూటర్న్ వద్ద నవీన్‌కుమార్ రాంగ్‌రూట్‌లో వెళ్లి డీసీఎంను ఢీ కొట్టాడు. దీంతో నవీన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.